## ఇసుక ట్రాక్టర్ల వేగానికి నియంత్రణ కరువు




2 లో...

- ❖ అధిక వేగంతో బెంబేలెత్తిస్తున్న వైనం
- ❖ నిత్యం వందల సంఖ్యలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 08 ఏప్రిల్, 2026 | పేజీలు : 08


# ఆరోగ్య ఆదిలాబాద్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

### కలెక్టర్ రాజర్షి షా




**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ అర్బన్:** ప్రజారోగ్య మే పరమావధిగా పనిచేసి జిల్లాను 'ఆరోగ్య ఆదిలాబాద్' గా తీర్చిదిద్దాలని కలెక్టర్ రాజర్షి షా వైద్యులకు, ఆరోగ్య శాఖ అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రిమ్స్ ఆసుపత్రి ఆడిటోరియంలో నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వారం రోజుల పాటు నిర్వహించే ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా సురక్షిత మాతృత్వం, ఎయిడ్స్ నివారణ, ఆయుష్ వంటి అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రిమ్స్ ఆసుపత్రిలో సర్జికల్ ఆంకాలజీ విభాగం సేవలు, శిశు మరణాల తగ్గింపు కోసం చేపట్టిన 'సంకల్ప' ప్రోగ్రామ్, టీబీ నివారణలో జిల్లా సాధించిన పురోగతికి జాతీయన స్థాయి గుర్తింపు రావడం అభినందనీయమన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండేలా ఆశా కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షించాలని, గర్భిణీలు రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆర్ ఎంపీల వద్దకు వెళ్లి అనవసరమైన యాంటీబయాటిక్స్ తీసుకోవడం వల్ల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ.. మారుతన్న జీవనశైలి కారణంగా సగటు మనిషి జీవితకాలం తగ్గిపోవడం ఆందోళనకరమని, ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరగాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలు పరిమితికి మించి మందులు ఇవ్వడం వల్ల ప్రాణాపాయం సంభవిస్తోందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ.. ఒత్తిడి లేని జీవనం కోసం ప్రతి ఒక్కరూ యోగా, వ్యాయమం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ సమయానికి నిద్ర, ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతరం టీబీ నియంత్రణపై అధికారులతో ప్రతిజ్ఞ చేయించి, ఆయుష్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే నూతన టీబీ ఎక్స్‌రే యంత్రాన్ని ప్రారంభించి, బాధితులకు నిక్షయ పోషణ్ కిట్‌లను అందజేశారు. డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, లీగల్ అడ్వైజర్ దాసరి గంగారం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గొడవలతో.. యువకుడు మృతి



**ప్రజాపక్షం/ముప్కాల్ :** మెండోరా మండలం పోచంపాడ్ గ్రామంలో కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. పాత వివాదాల నేపథ్యంలో జరిగిన ఘర్షణలో యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోచంపాడ్‌కు చెందిన రిషిక్, నర్సింలు కుటుంబాల మధ్య విభేదాలున్నాయి. సోమవారం సాయంత్రం ఇరువర్గాల మధ్య మళ్లీ వివాదం చెలరేగింది. దీంతో సమస్యను మాట్లాడుకుని పరిష్కరించుకోవడానికి నర్సింలు ఇంటి వద్దకు రిషిక్ వెళ్లగా ఘర్షణ జరిగింది.రిషిక్‌పై నర్సింలు కత్తితో దాడి చేశాడు. రిషిక్‌కి కడుపులో తీవ్ర గాయమవ్వగా నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని, మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుహాసిని తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతోనే..
# గ్రామాల అభివృద్ధి

### ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్..

**ప్రజాపక్షం/కుంటాల :** కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు.మండలంలోని వెంకూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.అనంతరం ఓలా గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ భవనం గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు.గల్లీలో తాగునీటి సమస్య తవ్రంగా ఉండటంతో,స్థానిక ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే కుళాయి నీటి సరఫరాను ప్రారంభించారు.దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సవిత బాజీరావు పటేల్,తహసీల్దార్ కమల్ సింగ్,ఎంపీడీవో అల్లాడి వనజ,బిజెపి నాయకులు జి.వి.రమణరావు,ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి

### కస్తూర్బా బాలికల విద్యాలయంను సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అం దించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం వర్ని మండలం కోటయ్య క్యాంపులో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు నిశితంగా పరిశీలించిన కలెక్టర్, పరిశుభ్రత పట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. బాలికల భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని, బయటి వ్యక్తులను లోనికి అనుమతించకూడదని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహ్యారించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అనంతరం 7వ తరగతి గదిని కలెక్టర్ సందర్శించి విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన డైరీలు, చాక్లెట్లు బహుమతులను అందించారు. చక్కగా చదువుకోవాలని అదే సమయంలో వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని జాగ్రత్తలు సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్ కేటాయిస్తామన్నారు. వంటగది పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ విద్యాలయానికి నూతన భవనం మంజూరైనందున వెంటనే పనులు ప్రారంభమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## సామాన్యులకు కార్పొరేట్ విద్య అభినందనీయం

### నగర మేయర్ మధుకర్

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడం అభినందనీయమని మంచిర్యాల నగర మేయర్ దర్ని మధుకర్ అన్నారు. మంగళవారం సిసిసి నస్పూర్‌లోని సృష్టి నవోదయ సైనిక్ స్కూల్ 13వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. లక్షల్లో ఫీజులు చెల్లించి కార్పొరేట్ పాఠశాలల్లో చదివించే స్తోమత లేని వారికి నాణ్యమైన విద్యను అందిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ప్రభుత్వం విజయవంతంగా నడుపుతున్న నవోదయ, సైనిక్ స్కూల్స్ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దడాన్ని మేయర్ కొనియాడారు.
నస్పూర్ మండల విద్యాధికారిణి పద్మ, స్థానిక కార్పొరేటర్లు, ట్రస్మా నాయకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా ఒకరి మృతి పలువురికి గాయాలు

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి బోల్తాపడ్డ ఆటో ప్రమాదంలో మహారాష్ట్రలోని శివుని గ్రామానికి చెందిన అస్తపోలు సాయన్న(85) మృతి చెందగా పలువురికి గాయాలైనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం కౌట్ల బి గ్రామంలో ఓ బంధువు అంత్యక్రియలకు వచ్చి పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణంలో రామ్‌సింగ్ తాండ గ్రామానికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది .ఇందులో ప్రయాణిస్తున్న సాయన్న, తిరుపతి ,లక్ష్మి లతో పాటు ద్విచక్ర వాహన చోదకుడు బజార్హత్నూర్ గ్రామానికి చెందిన సం జీవ్ కు గాయాలయ్యాయి.క్షతగాత్రులను నిర్మల్ ఆసుపత్రికి తరలించిగా చికిత్స పోందుతూ సాయన్న మృతి చెందారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన బాసర ఆలయ పూజారి



**ప్రజాపక్షం/బైంసా :** బాసర ఆలయ అభివృద్ధికి 225 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించడం లో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ కృషి అమోఘమని అయన సేవలు నియోజకవర్గంలో చిరస్థాయి గా నిలిచిపోతాయన ఆలయ పూజరులు,గ్రామస్థులు అన్నారు.మంగళవారం బైంసా లోని ఎమ్మెల్యే నివాసంలో శాలువాతో సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించిన సందర్భంగా వారు మాట్లాడుతూ.నిన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రావడం 225 కోట్ల నిధులతో భూమి పూజ చేయడం ఏంతో సంతోషన్ని కలిగించిందన్నారు.తన మనవడికి ఇక్కడే అక్షరాభ్యాసం చేయించి..పెద్ద మొత్తం లోఒకే సారి నిధులు మంజూరు చేయడం హర్షనీయమన్నారు.శాసనసభలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ పలు మార్లు బాసర సమస్యపై మాట్లాడటం జరిగిందన్నారు. ఆలయ పూజరులు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## 2003 ఉద్యోగులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** 2003 ఉద్యోగ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఆధారంగా రాష్ట్ర హైకోర్టు తీర్పును అమలు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మాడవేడి వినోద్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన ఆఫీస్‌లో 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నా వంతు ప్రయత్నంగా మీకు పాత పెన్షన్ ఇప్పించటానికి మంత్రులు, అధికారులతో నిరంతరం మాట్లాడుతానన్నారు. 10 రోజులలో సిఎంని కలిసి కేవలం మీ సమస్య పైననే మాట్లాడి పాత పెన్షన్ ఇప్పించటానికి కృషి చేస్తానని హామీనిచ్చారన్నారు. కార్యక్రమంలో 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మాడవేడి వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఇమ్మడి సంతోష్‌కుమార రాష్ట్ర కోశాధికారి గుంటి వేణుగోపాల్ పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### పంచాయితీల కీలక తీర్మానం

**ప్రజాపక్షం/ నేరడిగొండ:** నిర్మల్ జిల్లా నేరడిగొండ మండలంలోని గ్రామ పంచాయతీలు ప్లాస్లిక్ రహిత గ్రామాలుగా మారేందుకు నడుం బిగించాయి. ముఖ్యంగా పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, వేసవి కాలంలో గ్రామాల్లోకి రసాయనిక కూల్ డ్రింక్స్, ఐస్ క్రీమ్ తోపుడు బండ్లు రాకుండా అడ్డుకోవాలని పాలకవర్గాలు ఏకగ్రీవంగా తీర్మానించాయి. మండలంలోని ప్రధాన పంచాయతీలైన తేజాపూర్, కుమారి, వడూర్ సర్పంచులు శ్రీకాంత్, అగ్గిమల్ల గోదావరి లక్ష్మ న్న, వసుంధర నవీన్‌లు తమ పరిధిలో ప్లాస్లిక్ వాడకంపై కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామాల్లో జరిగే వివాహాది శుభకార్యాల్లో ప్లాస్లిక్ బఫే ప్లేట్లు వాడలం వల్ల భవిష్యత్తులో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. ఈ నిబంధనలను ఉల్లంఘించి గ్రామాల్లోకి ఐస్ క్రీమ్ బండ్లు తెచ్చినా, ప్లాస్టిక్ ప్లేట్లు వాడినా రూ. 5000 జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం సహకరించాలని కోరారు. కాలుష్య రహిత, జబ్బులు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పాలకవర్గ సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.




# విఠల్ రుక్మిణీ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్

**ప్రజాపక్షం/ తలమడుగు:** తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామంలో మహర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ విఠల్ రుక్మిణి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేను మహర్ సంఘం సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... గ్రామంలో ఏ కార్యక్రమం చేపట్టినా ప్రజలందరూ భేదభావాలు లేకుండా కలిసికట్టుగా నిర్వహించుకోవాలని సూచించారు. విఠల్ రుక్మిణిల ఆశీస్సులు కజ్జర్ల గ్రామంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన కోరుకున్నారు. పందరిపురంలో వెలసిన విఠలేశ్వరుడు సాక్షాత్తు వేంకటేశ్వర స్వామి స్వరూపమని భక్తుల నమ్మకమని, ఆ భక్తి



భావం సమాజంలో ఐక్యతను నింపుతుందని పేర్కొన్నారు. స్థానిక సర్పంచ్ ఎల్మా నారాయణ రెడ్డి, ఉపసర్పంచ్ గంగన్న, బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టే కుమార్, మండల అధ్యక్షుడు తోట వెంకటేష్, నాయకులు అభిరామ్ రెడ్డి, మహర్ సంఘం అధ్యక్షులు తోట పాముల రవి, వివిధ గ్రామల సర్పంచ్‌లు, మండల నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరోగ్యమే సర్వస్వం



### అదనపు డిఎంహెచ్ఓ డా. కుడ్మెత మనోహర్

**ప్రజాపక్షం/ ఉట్నూర్:** మనిషికి ఆరోగ్యమే సర్వస్వమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కుడ్మెత మనోహర్ సూచించారు. మంగళవారం ఉట్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలోని జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో మాట్లాడారు. ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లపై విద్యార్థులకు ఆయన సమగ్ర అవగాహన కల్పించారు. కేవలం శారీరక ఆరోగ్యమే కాకుండా, వైద్య, ఆరోగ్య రంగాల్లో విద్యార్థులకు ఉన్న ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ టి. ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ.. వైద్య నిపుణులు సూచించిన అంశాలను విద్యార్థులు తు.చ తప్పకుండా పాటించాలని కోరారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూనే తమ లక్ష్య సాధన దిశగా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని హితవు పలికారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. సాయి ప్రసాద్, జంతుశాస్త్ర విభాగాధిపతి డా. ఎం. నర్సింగ్ రావు, అధ్యాపకులు ఎ. రాజ్‌కుమార్, టి. ప్రజ్ఞ, స్ఫూర్తి, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సం సందర్భంగా నిర్వహించిన ఈ సదస్సు విద్యార్థుల్లో ఆరోగ్య స్పృహను పెంపోందించిందని అధ్యాపక బృందం పేర్కొంది.

## కొనుగోలుకేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

**ప్రజాపక్షం/పిట్లం:** రైతులు ధాన్యం కొనుగోలుకేంద్రాల్లో ధాన్యం విక్రయాలకు అధిక సంఖ్యలో విచ్చేస్తుంటారు వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని పిట్లం మండల భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం పిట్లం తహసీల్దార్‌కు వినతిప్రతం సమర్పించారు. వారు మాట్లాడుతూ రైతుల భూ విస్తీర్ణం ప్రకారం వారికరి రైతు భరోసా డబ్బులు వారి ఖాతాలో జమచేయాలని, యూరియా యాప్‌ను వెంటనే తొలగించి నేరుగా రైతులకే యూరియా బస్తాలు సకాలంలో అందించాలని, రైతులకు సరిపడా యూరియా తెప్పించాలని, మొక్కజొన్న, జొన్న, వరి కొనుగోలుకేంద్రాలను మండల వ్యాప్తంగా త్వరితగతిన ఏర్పాటు చేయాలని వారు తహసీల్దార్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ పిట్లం శాఖ అధ్యక్షుడు గొల్ల అంజయ్య, కార్యదర్శి పరమేశ్వర్‌రెడ్డి, మండల కార్యదర్శి జి.లక్ష్మ ణ్, విజయభాస్కర్‌రెడ్డి, రైతులు సుదర్శన్‌గౌడ్, సంఘమేశ్వర్, గోపాల్ రెడ్డి, మల్లయ్య, రాములు, నారాయణ, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేసవికాలంలో ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/పిట్లం:** వేసవికాలం ప్రారంభం నుండే ఎండల ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పోలీసు కళాబృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర ఆదేశాల మేరకు పిట్లం పోలీసు కళాబృందం సభ్యులు మండల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930కు కాల్ చేయాలని, అత్యవసర సమయంలో డయల్ 100ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీటు బెల్టు ధరించకుండా రోడ్లపైకి వాహనాలు తీసుకురావద్దన్నారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పెద్ద నేరమని, దీనికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకట్‌రావుతో పాటు పోలీసు కళాబృందం ఇంచార్జి హెడ్ కానిస్టేబుల్ ఆర్.తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ శేషరావు, కానిస్టేబుళ్ళు ప్రభాకర్, సాయిలు, పిట్లం బ్లూ కోట్ పీసీ నవీన్, హెడ్ కానిస్టేబుల్ సాయిలు, బాన్సువాడ షీ టీం బృందం పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్ల వేగానికి నియంత్రణ కరువు

(మొదటి పేజీ తరువాయి)

ఇసుక ట్రాక్టర్ల అతివేగానికి నియంత్రణ కరువైంది. సుల్తానాబాద్ మండల వ్యాప్తంగా గొల్లపల్లి, నారాయణ రావు పల్లి, నీరుకుల్ల, గట్టపల్లి, కదంబ పూర్,తొగర్రాయి, మంచిర్యామి, తదితర గ్రామాలను కలుపుకొని మానేరు వాగు ప్రవహిస్తూ ఉంది. ఈ మానేరు వాగులో తోడుకున్నోళ్లకు తోడుకున్నంత ఇసుక లభిస్తుండడంతో తదితర గ్రామాల కు చెందిన ప్రజలు ఇసుక రవాణా అనే ఉపాధిగా మలుచుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా ఇసుక క్వారీలు ఏర్పాటు చేసి మానేరు పరివాహక ప్రాంతాలను దెబ్బతీయగా ప్రస్తుత ప్రజా ప్రతినిధులు స్థానికంగా ఉన్న ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండాలి మానేరు పర్వాక ప్రాంతాన్ని పరిరక్షించాలని ముఖ్య ఉద్దేశంతో ఇసుక క్వారీలను రద్దు చేశారు. ఇసుక ట్రాక్టర్ల యజమానులకు అధికారులు పలు సూచనలు చేయుచున్నప్పటికీ వాటిని తుంగలో తొక్కుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఉదయం లేచిందే మొదలు సుల్తానాబాద్ మీదుగా అతివేగంగా ట్రాక్టర్లను నడుపుతూ పాదాచారులను, ప్రయాణికులను ఇతర వాహనాదారులను బెంబేలితిస్తున్నారు. మండల వ్యాప్తంగా వందల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు ఉండగా నారాయణరావుపల్లి గొల్లపల్లి తదితర గ్రామాలకు చెందిన ఇసుక ట్రాక్టర్లు ఇసుకను కరీంనగర్ తదితర ప్రాంతాలకు తరలిస్తూ ఉంటారు. నీరుకుల్ల గ్రామం నుండి మొదలుకొని గట్టే పల్లి, కదంబపూర్, తొగర్రాయి, మంచిరామి గ్రామాలకు చెందిన ఇసుక ట్రాక్టర్లు సుల్తానాబాద్ మీదుగా పెద్దపల్లి తదితర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తారు. ఇసుక ట్రాక్టర్లకు ఉదయం 6 నుండి సాయంత్రం ఆరు వరకు మాత్రమే ఇసుకను తరలించాలి అనే నిబంధన ఉండడంతో అధిక ట్రిప్పులు కొట్టాలైన ముఖ్య ఉద్దేశంతో ఇష్టానుసారంగా అతివేగంగా వాహనాన్ని నడుపుతున్నారు. సుల్తానాబాద్ తెలంగాణ చౌరస్తా నుండి మొదలుకొని పోలీస్ స్టేషన్ రోడ్,మార్కెట్ ఏరియా బస్టాండ్ తదితర ప్రాంతాల్లో నిత్యం వందల సంఖ్యలో పాదాచార్యులు, ఇతర ప్రయాణికులు, ఉదయం పాఠశాలకు వెళ్లే విద్యార్థిని విద్యార్థులు ఉన్నప్పటికీ వారిని పట్టించుకోకుండా భయభ్రాంతులకు గురయ్యే విధంగా ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు ఇష్టానుసారంగా వాహనాలను నడుపుతున్నారు. గతంలో అనేక ప్రమాదాలు ఇసుక ట్రాక్టర్ల వలన జరిగినప్పటికీ వాటిని వేగాన్ని నియంత్రించడంలో అధికారుల నిఘా కరువైందని ప్రయాణికులు పరేషాన్ అవుతున్నారు. ఇప్పటికైనా ఇసుక ట్రాక్టర్ల యజమానులకు డ్రైవర్లకు కఠినమైన నిబంధనలు విధించి వాటి వేగాన్ని నియంత్రించాలని పలువురు కోరుచున్నారు.

## టెన్త్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ రాజర్షి షా

**ప్రజాపక్షం/ మావల:** పట్టణంలోని వినాయక్ చౌక్ ప్రాంతంలో ఉన్న బాలక్ మందిర్ పాఠశాల పదో తరగతి పరీక్షా కేంద్రాని జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ తీరును ఆయన స్వయంగా పర్యవేక్షించారు. కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన వసతులపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ఎక్కడా లోపాలకు తావుండకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ తహసీల్దార్ శ్రీనివాస్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఉదయ్ రావు, ప్రేమ్ నివాస్, చీఫ్ సూపరింటెండెంట్ సారా ఖాతూన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యాజ్వేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్‌లో సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఇరువురు లబ్దిదారులకు కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లిఖార్జున్ మంగళవారం సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని పెద్ద ఆరేపల్లి గ్రామానికి చెందిన వేముల విఠల్‌కు, బంజపల్లి గ్రామానికి సమీర్‌కు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా నిలుస్తుందన్నారు. సీఎంఆర్ఎఫ్ వంటి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం

**ప్రజాపక్షం/ముప్కాల్ :** మండలంలోని రెంజర్లకు చెందిన సాయమ్మ అనే 75 ఏళ్ల మహిళ నాలుగు రోజుల నుండి కనిపించటం లేదని కుటుంబ సభ్యులు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌పాల్ తెలిపారు. కాగా సాయమ్మ ఇంటి నుండి వెళ్లేటప్పుడు రెడ్ కలర్ బ్లౌజ్, ఆరెంజ్ కలర్ సారీ ధరించి ఉందని, ఎవరైనా ఆచూకీ తెలిసినచో 8712 659762 కు సమాచారమందించాలన్నారు.

## సురక్ష క్లినిక్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

**ప్రజాపక్షం/ముప్కాల్ :** ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సురక్ష క్లినిక్‌కు (సుఖ వ్యాధుల చికిత్స కేంద్రం) రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. మంగళవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి సంబంధించిన సురక్ష క్లినిక్ (సుఖ వ్యాధుల చికిత్స కేంద్రం) (ఎయిడ్స్ నియంత్రణ విభాగం) రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు ఆరోగ్యశాఖ మంత్రి, ప్రిన్సిపాల్ హెల్త్ సెక్రటరీ చేతుల మీదుగా స్కిన్ డిపార్ట్‌మెంట్స్ హెచ్‌ఓడీ డాక్టర్ రామ్మోహన్, అదనపు జిల్లా వైద్యాధికారి (ఎయిడ్స్/లెప్రసి) డాక్టర్ దేవి నాగేశ్వరి, సురక్ష క్లినిక్ కౌన్సిలర్ వరలక్ష్మి తీసుకోవటం జరిగింది.

## ప్రతి ఒక్కరూ కళాశాల అభివృద్ధికి పాటు పడాలి

### ప్రిన్సిపల్ డాక్టర్ టి.పెద్దన్న

**ప్రజాపక్షం/మోర్తాడ్:** ప్రతి ఒక్కరూ కళాశాల అభివృద్ధికి పాటు పడాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.పెద్దన్న కోరారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.పెద్దన్న అధ్యక్షతన లోకల్ డెలిగేట్స్ పేరెంట్స్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 13ఏండ్లుగా కళాశాల అభివృద్ధికి ప్రిన్సిపల్ చేస్తున్న కృషిని పేరెంట్స్ కొనియాడారు. మంగళవారం కళాశాల పూర్వ విద్యార్థి జాగిర్యాల గ్రామానికి చెందిన మంగారపు వినోద్ కుమార్, అటనమాస్ రిజిస్ట్రేషన్ ఫీజు 60వేల రూపాయాలు, మాజీ వార్డు మెంబర్ తక్కురి కిషన్, ప్యూరిఫైయర్ కు 57వేల రూపాయలు ఇచ్చినట్లు తెలిపారు. వారిరువురిని ప్రిన్సిపల్ ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రిన్సిపల్ పెద్దన్న మాట్లాడుతూ.. కళాశాల దశల వారి అభివృద్ధి చేసేందుకు మీ వంతు సహాయ సహకారాలు అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. అందరి సూచనలు సలహాలు తీసుకొని కళాశాల అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మర్రిపల్లి భూపతి, కో ఆర్డినేటర్ దశరథ్, సీనియర్ అధ్యాపకులు రాజయ్య, డాక్టర్ రవీందర్, నాగపూర్ సర్పంచ్ అశోక్, రిటైర్డ్ మేనేజర్ ఆరేపల్లి బుచ్చయ్య, పూర్వ విద్యార్థులు జైపాల్, నవీన్, ఇల్లెందు జీవన్, కిరణ్, శరత్, సాయన్న, అధ్యాపక, అధ్యాపకే



# నిరుద్యోగులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిరుద్యోగులు తమ కాళ్ళ మీద తాము నిలబడేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి కోర్సులను,వృత్తి నైపుణ్య శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పిలుపునిచ్చారు.మంగళవారం నిర్మల్ పట్టణంలో జరిగినశిక్షణాఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.




### సేవా వృత్తిలో నర్సింగ్ అత్యుత్తమం..

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవం'లో ఆయన ప్రసంగించారు.రోగులకు సేవలందించే నర్సింగ్ వృత్తి ప్రపంచంలోనే అత్యంత గౌరవప్రదమైనదని కొనియాడారు.నిర్మల్ నర్సింగ్ కళాశాల నుండి త్వరలోనే 120 మంది విద్యార్థులు వృత్తిలోకి అడుగుపెట్టబోతుండటం గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు.యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

### స్వయం ఉపాధితోనే ఆర్థిక బలోపేతం..

అనంతరం రాంనగర్ పి.హెచ్.సిలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన వృత్తి నైపుణ్య శిక్షణ ముగింపు సభలో ఆయన పాల్గొన్నారు.శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేస్తూ.స్వల్ప కాలిక కోర్సులు నిరుద్యోగులను త్వరగా ఉపాధి లేదా వ్యాపార రంగంలో స్థిరపడేలా చేస్తాయని తెలిపారు.యువత ఉపాధి కోసం ప్రభుత్వం బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని,ఇలాంటి అవకాశాలను యువత వదులుకోవద్దని సూచించారు.ఈ కార్యక్రమాల్లో డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజేందర్,డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ పవన్,నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శకుంతల,కౌన్సిలర్లు,ఎస్.పి.రాజు,కొండాజీ రాఘువేంద్రచారి,ఫిరోజ్,విఠల్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత విద్యావకాశాలు క్రీడాకారులకు ఆహ్వానం

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలో విద్యార్థులు,యువత నైపుణ్యాలను పెంపోందించేందకు ఈ ఏడాది వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ()నర్వి్హించనున్నారు.ఈ శిబిరాల్లో శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి కలిగిన వ్యాయామ ఉపాధ్యాయులు,సీనియర్ క్రీడాకారుల నుంచి జిల్లా యువజన,క్రీడల శాఖ అధికారి బి.శ్రీకాంత్ రెడ్డి దరఖాస్తులను ఆహ్వానించారు.అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 15వ తేదీలోపు జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలోని రెండో అంతస్తులో ఉన్న రూమ్ నం. ఎస్25(డివైఎస్ఓ కార్యాలయం)లో సమర్పించాల్సి ఉంటుంది.స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి శిక్షకుల ఎంపిక ప్రక్రియ చేపడతామని అధికారులు స్పష్టం చేశారు.ఆనాథ,పేద విద్యార్థినులకు వరం..పాలిటెక్నిక్ కోర్సుల్లో ఉచిత ప్రవేశం..హైదరాబాద్‌లో దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో 202627 విద్యా సంవత్సరానికి గానున వివిధ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ప్రారంభమయ్యాయి.పదో తరగతి ఉత్తీర్ణులైన అనాథలు,తల్లి లేదా తండ్రి లేని పాక్షిక అనాథలు,నిరుపేద(పిబిఎల్) కుటుంబాల విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారిణి వినూత్న తెలిపారు.సివిల్,ఎలక్ట్రికల్,కంప్యూటర్ ఇంజనీయింగ్‌తో పాటు సెమీ కండక్టర్ టెక్నాలజీ వంటి అత్యాధునిక కోర్సులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.ఆసక్తి గల అభ్యర్థులు మే 25వ తేదీలోపు నిర్మల్ జిల్లా కేంద్రంలోని బాల రక్షా భవన్'లో దరఖాస్తు చేసుకోవచ్చు మరిన్ని వివరాల కోసం 9963738012 నంబర్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

## లక్కంపల్లి సెజ్‌లో పామాయిల్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు కలేనా.?

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండలంలో లక్కంపల్లి సెజ్‌లో స్మార్ట్ ఆగ్రో ఫుడ్ భాగంగా పామాయిల్ పరిశ్రమ ఏర్పాటు కానున్నట్టు ఈ మేరకు అడుగులు పడుతున్నాయని రాష్ట్ర సలహాదారులు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ సెజ్‌లో ఆయిల్ ఫామ్ గెలలు సేకరించి ముడి చమురు తీసి రిఫైన్డ్ ఆయిల్ తీసే విదంగా పరిశ్రమ నిర్మించనున్నట్టు 40 ఎకరాలు ప్లాంట్‌కు, 10 ఎకరాలు విద్యుత్ ఉప కేంద్రంకు గుర్తించామని, ఈ పరిశ్రమకు రూ. 250 కోట్లు ఖర్చు చేస్తారని ఆయన అన్నారు. ఈ సెజ్‌లో పసుపు కుర్కుమిన్ ప్లాంట్, మరో మూడు రైస్ మిల్లులు, చిన్న చిన్న పరిశ్రమలు ఉన్నాయి. ఇవి పోను ఇంకా 271 ఎకరాలవరకు మిగులు భూమి ఉంది. జిల్లాలో సుమారు 3600 ఎకరాలు ఆయిల్ గెలలు సాగు చేస్తున్నారు. ఖమ్మం జిల్లా అశ్వారావుపేటకు ప్రస్తుతం తరలిస్తున్నారు. అదే పామాయిల్ పరిశ్రమ సెజ్‌లో ఉంటే పండిన గెలలు కొనుగోలు చేయవచ్చు. జిల్లాలో ఉద్యానవన శాఖ విస్తృతంగా ప్రచారం చేస్తుంది. సన్న చిన్నకారు రైతులకు సబ్సిడి ఇచ్చి రైతులను ప్రోత్సహిస్తుంది. పరిశ్రమల శాఖ అధీనంలో ఉన్న భూముల చుట్టు వివాద భూములు ఉన్నాయి. మిగిలిపోయిన 221 ఎకరాలలో విద్యుత్, రోడ్లు నిర్మించడానికి అధికారులు సుమారు 60 కోట్ల ప్రతిపాదనలు రూపొందించారు. నిజామాబాద్ జిల్లాలో పామాయిల్ పరిశ్రమ కోసం ప్రయత్నిస్తానని జిల్లాకు మొదటిసారి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు పొద్దుటూరు సుదర్శన్ రెడ్డి సభాముఖంగా అన్నారు. లక్కంపల్లి సెజ్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. అందుకే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలుస్తుంది. ఈ సెజ్‌కు మరిన్ని పరిశ్రమలు రానున్నట్టు తెలుస్తుంది. చూడాలి జిల్లా క్యాబినెట్ మంత్రి స్థాయిలో అభివృద్ధి జరగనుంది.

# పోలీసులుగా విధి నిర్వహణ ఎంత ముఖ్యమో ఆరోగ్య అంతే ముఖ్యం

### పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** విధి నిర్వహణలో పోలీసులు 24/7 విధులు నిర్వహిస్తు తమ ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు చూసుకోవాలని, ఆరోగ్యం పట్ల ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పోలీసు కమిషనర్ పి. సాయిచైతన్య అన్నారు. మంగళవారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మనోరమ సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ వారిచే ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య, నిజామాబాద్ నగర పాలక సంస్థ చైర్మన్ కె. ఉమారాణి హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పోలీసు కమిషనర్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది 24/7 విధి నిర్వహిస్తు తమ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు ఎల్లప్పుడు తీసుకోవాలన్నారు. ఆరోగ్యం బాగున్నప్పుడే విధి నిర్వహణకు తమ శరీరం సహకరిస్తుందని, ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏ సీజన్లో వచ్చే పండ్లను ఆ సీజన్లో తినటం అలవాటు చేసుకోవాలన్నారు. మన శరీరానికి ఏ ఆహారం తింటే జీర్ణం అవుతుందో అదే ఆహారాన్ని తీసుకోవాలని, జీర్ణం కాని ఆహారం తీసుకొని బాధపడకూడదన్నారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. డాక్టర్ల సూచనలు సలహాలు తప్పనిసరి పాటించాలన్నారు. ఐఎంఏ ఆధ్వర్యంలో ఇలాంటి ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించడం ఎంతో సంతోషకరమని, భవిష్యత్తులో ఇలాంటి క్యాంపులు ఇంకా అనేకం నిర్వహించాలన్నారు. పోలీసు సిబ్బందికి, మునిసిపల్ పారిశుద్య కార్మికులకు ప్రత్యేకంగా ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు.

## రాజురలో నూతన విడిసి ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని రాజుర గ్రామంలోని నూతన వీడిసి కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు.నూతనంగా వీడిసి చైర్మన్ ముత్తగౌడ్,వైస్ ప్రెసిడెంట్ నర్సింగ్‌రావు,క్యాషియర్ జిల్కరి సాయి ప్రసాద్,టికీ శ్రీనివాస్,వీడిసి కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

## బూరుగుపల్లె(జి)లో మెగా వైద్య ఆరోగ్య శిబిరం

**ప్రజాపక్షం/నర్సాపూర్ (జి):** మండలంలో ఆర్టీసీ బస్సు సౌకర్యంనికి నోచుకొని ఎకైక గ్రామం బూరుగుపల్లె(జి) గ్రామం,ఇక్కడ ప్రజలకు ఏ చిన్న రోగం వచ్చిన మండలంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి వెళ్లాల్సిందే.ప్రసూతి సమయంలో ప్రభుత్వ అంబులెన్స్ సౌకర్యాన్ని వినియోగించుకొన్న ప్రాణం మాత్రం అరచేతిలో పెట్టుకొని ఆసుపత్రికి చేరాల్సిందే.ఇలాంటి సమస్యలు తన గ్రామంలో ఉన్నాయి అని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ అరుణ్ లాల్ నాయక్ ప్రభుత్వ వైద్యులు డాక్టర్ దామోదర్ చె మెగా వైద్య శిబిరాన్ని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో నిర్వహించారు.ప్రజలకు బీపీ,షుగర్,తో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు.మందులను పంపిణీ చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించిందనీ ఇలాంటి వైద్య శిబిరాన్ని ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించేలా చూస్తామని ఆయన అన్నారు.పంచాయతీ కార్యదర్శి శివకుమార్,హెడ్మాస్టర్ ప్రభాకర్,ఎఎన్ఎం మాధవి,ఆశావర్కర్లు జంగన్న గారి లావణ్య,తోట శకుంతల,కోటగిరి ప్రతిభ,బాలేరు లక్ష్మి ,తో పాటు దన్ను,రాథోడ్ ఆశోక్,గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేద్ ఆగ్రో జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఫైర్ మాక్ డ్రిల్

### అగ్ని ప్రమాదాలపై అవగాహన..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్మల్‌లో ముందస్తుప జాగ్రత్తల పరిశీలన నిర్మల్ జిల్లా కేంద్రంలోని వేద్ ఆగ్రో జిన్నింగ్ ఫ్యాక్టరీలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక (99 రోజుల ప్రోగ్రామ్)లో భాగంగా భారీ ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు.జిల్లా ఫైర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,ప్రాణ ఆస్తి నష్టాన్ని ఎలా నివారించాలనే అంశాలపై ఫ్యాక్టరీ సిబ్బందికి ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు.ప్రమాద సమయంలో ఫైర్ ఇంజిన్ల వినియోగం,అత్యవసర సేవల సమన్వయం గురించి అధికారులు వివరించారు.నిర్మల్ ఆర్డీఓ రత్నకళ్యాణి,నిజామాబాద్ డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ లక్ష్మి కుమారి,జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జి.వి.నర్సింహారెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్,పోల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి రంజిత్ కుమార్,డీటీ వెంకటరమణ,వేద్ ఆగ్రో డైరెక్టర్లు కాశీనాథ్,కృష్ణ సంతోష్,ఫ్యాక్టరీ సిబ్బంది పాల్గొన్నారు.పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను అరికట్టవచ్చని అధికారులు పేర్కొన్నారు.

## ఉప్లూర్‌లో ఉచిత పశు వైద్యశిబిరం

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి:** మండలంలోని ఉప్లూర్ గ్రామంలో పశువైద్యకళాశాల కోరుట్ల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఎన్ఎస్ఎస్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు పేడ పరీక్షలు, రక్తపరీక్షలు చేసి పశువులకు వ్యాపించిన వ్యాధులను గుర్తించి తగిన చికిత్స నిర్వహించారు. గైనకాలజి ప్రొఫెసర్లు డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ విశాల్ గర్భనిర్ధారణ పరీక్షలు చేసి గర్భ సమస్యలపై విశదీకరంగా వివరించి పలు సూచనలిచ్చి చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమాన్ని కోరుట్ల పశు వైద్య కళాశాల అసపోసియేట్ డీన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేసి శిబిరం వివరాలు తెలుసుకుని రైతులకు, విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటేశ్వర్లు, నాగరాజు, ప్రవీన్‌రెడ్డి, వసంత్, స్వరన్, ఉపసర్పంచ్ శేఖర్, వార్డు సభ్యులు అజయ్, సంతోష్, సతీష్, శేఖర్ పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మోపాల్ మండలం బోర్గాం(పి) గ్రామంలోని సాక్రెడ్ హార్ట్ అకాడమీ పాఠశాలలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. నిబంధనలకనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్నపత్రాలను తెరిచారా ? స్ట్రాంగ్ రూం నుండి ఎన్ని గంటలకు ప్రశ్నపత్రాలు కేంద్రానికి చేరుకున్నాయి. ఆ సమయంలో పోలీస్ ఎస్కార్ట్ ఉందా ? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి వసతి, ప్రథమ చికిత్స అందుబాటులో ఉందా ? లేదా ? అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని చీఫ్ సూపరింటెండెంట్ రమేష్‌కు సూచించారు.

## బుద్ధ విహార్ నిర్మాణానికి లక్ష రూ. ఆర్థిక సాయం

**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న తథాగత గౌతమ బుద్ధ విహార్ నిర్మాణానికి, అంబేద్కర్ జయంతి నిర్వహణకు లక్ష్మణ సేవాసదన్ వెల్ఫేర్ సొసైటీ తరపున లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేసినట్లు సంస్థ అధ్యక్షుడు గాదె అవినాష్, ఉపాధ్యక్షుడు అశోక్ మహుల్కర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో భారతీయ బౌద్ధ మహాసభ, సమతా సైనిక దళ్, అంబేద్కర్ సంఘం నాయకులకు ఈ నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుద్ధ విహార్‌లో నిరుపేద విద్యార్థులకు ఉచిత ట్యూషన్లు అందిస్తూ, వారిని ఉన్నత విద్య దిశగా ప్రోత్సహిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకుల కృషిని ప్రశంసించారు. తమ సంస్థ ద్వారా ఇప్పటికే అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టినట్లు వారు వివరించారు. ఇటీవల నిర్వహించిన గురుకుల విద్య ప్రవేశ పరీక్షల్లో కులమతాలకు అతీతంగా ఎనిమిది మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి సీట్లు పొందడం సంతోషకరమని పేర్కొన్నారు. ఇలాంటి విద్యార్థులకు భవిష్యత్తులో మరింత సహకారం అందించేందుకు లక్ష్మణ సేవాసదన్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని వెల్లడించారు. భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్, సమతా సైనిక దళ్ జిల్లా అధ్యక్షుడు దుర్గం సందీప్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రోషన్ ఉప్రే, సమాజ అధ్యక్షుడు శ్యామ్ రావు లహూజి దుర్గే, కోశాధికారి ఉప్రే, నాగ్ సేన్, నాయకులు అరుణ్ కుమార్, రమేష్ డోంగ్రే పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు అందుకున్న కిషన్, రఫీక్

**ప్రజాపక్షం / జన్నారం :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లా జన్నారం ట్రైబల్ ఏరియాకు చెందిన ఈఎంటి కిషన్, పైలట్ రఫీక్ రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వీరికి ఈ పురస్కారాలను అందజేశారు. రాష్ట్ర డిప్యూటీ సిఎం దామోదర్ రాజనర్సింహ, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ క్రిస్టియానో, హెల్త్ కమిషనర్ సంగీత, హైదరాబాద్ కలెక్టర్ చేతుల మీదుగా కిషన్‌ను ఉత్తమ ఈఎంటిగా, రఫీక్‌ను ఉత్తమ పైలట్‌గా ఎంపిక చేసి అవార్డులతో సత్కరించారు. తమ విధుల్లో ప్రతిభ కనబరిచినందుకు గాను ఈ గౌరవం దక్కినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న కిషన్, రఫీక్‌లను ప్రోగ్రాం మేనేజర్ స్వామూట్, జిల్లా ఇఎంఇ కొండలరావు అభినందించారు.

## నార్లాపూర్‌లో రూ.ఏడు లక్షల రూపాయల సిసి రోడ్డు పనుల ప్రారంభం

**ప్రజాపక్షం / వాంకిడి :** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వాంకిడి మాజీ జడ్పిటిసి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు అజయ్ కుమార్ అన్నారు. మంగళవారం వాంకిడి మండలంలోని సరండీ గ్రామ పంచాయతీ పరిధి నార్లాపూర్‌లో ఎన్ఆర్ఇజిఎస్ పథకం కింద ఏడు లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను సర్పంచ్ మొహర్లే బాపూజీతో కలిసి ఆయన ప్రారంభించారు.గ్రామాభివృద్ధిలో భాగంగా చేపట్టిన మాజీ సింగిల్ విండో చైర్మన్ పేంటు, ఉప సర్పంచ్ బాపన్, గౌరయ్య, బాపూరావు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చెట్ల అక్రమ విక్రయంపై విచారణ జరపాలి

### మండల అధికారికి గ్రామస్తుల విన్నపం



**ప్రజాపక్షం / కౌటాల :** మండలంలోని కనికి గ్రామంలో పల్లె ప్రకృతి వనం, స్మశాన వాటికలోని చెట్లను అక్రమంగా విక్రయించినట్లు గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఉపాధి హామీ పథకం ద్వారా నాటిన నీలగిరి చెట్లను ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించారని, వీటి విలువ సుమారు 2.50 లక్షల రూపాయల వరకు ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో గ్రామ సర్పంచ్ నాయిని శ్రీనివాస్, ఉప సర్పంచ్ అభిలాష్ పాత్ర ఉందని వారు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా గ్రామంలో పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదని, కారోబారీ కమిటీ సభ్యులు తమ బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పనులు చేయకపోయినా వారికి జీతాలు చెల్లిస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు మండల అభివృద్ధి అధికారికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# హజ్ యాత్రికులు తప్పనిసరిగా టీకా వేయించుకోవాలి



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులు తప్పనిసరిగా టీకా వేయించుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్లు సద్దాం హుస్సేన్, దస్తగీర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని సంతోష్ ఫంక్షన్ హాల్లో కాగజ్ నగర్ హజ్ సొసైటీ ఆధ్వర్యంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా హజ్ 2026 యాత్రికులకు టీకా వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాత్రికులు యాత్ర సమయంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ద్వారా ఎంపికైన ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన 40 మంది మహిళలు, పురుషులు ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లనున్నట్లు వెల్లడించారు. అనంతరం యాత్రికులకు మెడికిట్లు, బ్యాగులు, ఇతర అవసరమైన సామాగ్రిని పంపిణీ చేశారు. యాత్రలో పాటించాల్సిన నిబంధనలను వారికి కూలంకషంగా వివరించారు. డిఎంహెచ్ఓ సీతారాం, డాక్టర్ నవీన్ అహ్మద్ ఖాన్, డాక్టర్ అప్ష, కోటేష్, మోసిన్ అహ్మద్ ఖాన్, సుజాత్ హుస్సేన్, శ్రీకాంత్, సాయి, రాజు, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది, హజ్ కమిటీ సొసైటీ ప్రధాన కార్యదర్శి ముఫకం అహ్మద్, హాఫిజ్ రియాజ్, షాకీర్, మీర్ సాబీర్ అలీ హాస్మీ, ఆన్సర్ సత్తార్ పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు మొబైల్ ఫోన్లు, చిన్నారులకు దుస్తుల పంపిణీ

### ఎంఎల్ఎ డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** అంగన్వాడీ టీచర్లు, ఆయాల గౌరవ వేతనం పెంచాలని అసెంబ్లీలో డిమాండ్ చేసినట్లు సిర్పూర్ ఎంఎల్ఎ డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. మంగళవారం సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని సిడిపిఒ కార్యాలయ ప్రాంగణంలో ప్రజా పాలన –ప్రగతి ప్రణాళికలో భాగంగా అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు, చిన్నారులకు ఏకరూప దుస్తులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బంది తీవ్ర పని ఒత్తిడిలో పని చేస్తున్నారని, ప్రభుత్వం వారి వేతనాలు పెంచే దిశగా చర్యలు చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిబ్బందికి ఉపశమనం కలిగించేలా మరిన్ని సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సిడిపిఒ విజయలక్ష్మి, సూపర్వైజర్ పద్మ, ఎంఆర్ఒ రహీముద్దీన్, ఎంపిడిఒ సత్యనారాయణ, సర్పంచ్ ఒడ్డేటి నాగమణి, నానయ్య, లావణ్య, ఉప సర్పంచ్ దుర్గం ప్రశాంత్, మండలంలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, నాయకులు పాల్గొన్నారు.

## నర్సరీ నిర్వహణ పక్కాగా ఉండాలి

### ఎంపిడిఒ సత్యనారాయణ

**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** గ్రామపంచాయతీ నర్సరీలో మొక్కల పెంపకం బాధ్యతాయుతంగా చేపట్టాలని ఎంపిడిఒ సత్యనారాయణ అన్నారు. మంగళవారం సిర్పూర్ టి మండలంలోని వెంకట్రావుపేట గ్రామ పంచాయతీని ఆయన సందర్శించారు. నర్సరీని పరిశీలించిన ఆయన మొక్కలకు ప్రతిరోజూ నీరు పట్టాలని, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా నిర్వహణ ఉండాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



## కలమడుగులో ఘనంగా ఎల్లమ్మ పట్నాలు, బోనాలు

**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం మండలం కలమడుగు గ్రామంలో ఎల్లమ్మ అమ్మవారి పట్నాలు, బోనాల వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎంఎల్ఎ వెడ్మ బొజ్జు పటేల్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ బోనాలు సమర్పించడం మన సంస్కృతిలో భాగమని కొనియాడారు. గ్రామంలో శాంతి సౌభ్రాతృత్వాలు నెలకొని ప్రజలంతా ఐక్యంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు మోస్తూ మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన పట్నాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, యువకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండలంలోని పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల తహసీల్దార్ దత్తాత్రి కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజల అవసరాలపై సానుకూలంగా స్పందించిన తహసీల్దార్, రానున్న రోజుల్లో అర్హులకు ప్రభుత్వ ఫలాలు అందుతాయని హామీనిచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో సొంత ఇల్లు లేని అర్హులైన వారందరికీ వచ్చే విడతలో ఇందిరమ్మ ఇళ్లు లేదా స్థలాలు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే గత కొంతకాలంగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకొని ఎదురుచూస్తున్న వారికి వచ్చే నెల నుంచి ఫించన్లు మంజూరు చేస్తామని సానుకూల ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల కార్యదర్శి జంగం గంగాధర్ మాట్లాడుతూ.. మండలంలోని 17గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం అమరులు తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పథకం సక్రమంగా అమలు కావడం లేదని, కూలీలకు పనులు కల్పించడంలో జాప్యం జరుగుతోందని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి తామంతా ఒక బృందంగా ఏర్పడి గ్రామాల్లో పర్యటిస్తామని నాయకులు తెలిపారు. పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారి అర్హతలను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకు చేరేలా నిరంతరం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు జె.పద్మ, జాడి సాయిలు, శాఖ సభ్యులు కె. లక్ష్మి, ఎం.సులోచన, కె.మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధిత కుటుంబాలకు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అండగా నిలిచారు. ఎడపల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన సంఘం సాయమ్మ, సంఘం లాస్య గత కొంతకాలం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రైవేట్ ఆస్పత్రిలో వీరికి శస్త్రచికిత్స జరగడంతో భారీగా ఖర్చు అయింది. తమకు ఆర్థిక సాయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు ఎంపీ ధర్మపురి అరవింద్ ని కలిసి విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించి సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేయించారు. ఎంపీ చొరవతో ప్రభుత్వం నుంచి వీరికి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం ధర్మారం గ్రామంలో బాధితులకు ఎంపీ పీఎ నారాయణ, బిజెపి మండల అధ్యక్షులు కోల ఇంద్రకరణ్, గ్రామ నాయకులు కోటేష్ కలిసి సంఘం లాస్యకు రూ. 49,500, సంఘం సాయమ్మకు రూ. 15వేలు చెక్కులను అందచేశారు. తమ కష్టకాలంలో స్పందించి ఆర్థిక సాయం అందేలా కృషి చేసినందుకు బాధిత కుటుంబ సభ్యులు ఎంపీ ధర్మపురి అరవింద్ కి, బోధన్ నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డికి, వడ్డీ మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉత్పత్తి కంటే ప్రాణ భద్రతే ప్రధానం

### కార్పొరేట్ జనరల్ మేనేజర్ సాయిబాబు

**ప్రజాపక్షం / మందమర్రి :** సింగరేణి సంస్థలో ఉత్పత్తి లక్ష్యాల కంటే ప్రతి కార్మికుడి ప్రాణ భద్రతే అత్యంత ముఖ్యమని కార్పొరేట్ జనరల్ మేనేజర్ సాయిబాబు అన్నారు. మంగళవారం మందమర్రి ఏరియాలోని కెకె ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టును ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణతో కలిసి గనిలోని పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా క్వారీలో కొనసాగుతున్న బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలు, ఓవర్ బర్డెన్ తొలగింపు పనులను పర్యవేక్షించి భద్రతా ప్రమాణాల అమలుపై అధికారులను ప్రశ్నించారు. భద్రతా నిబంధనల అమలులో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా సహించబోమని, మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గనుల్లో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జనరల్ మేనేజర్ కె. రఘుకుమార్, ఎస్ఒటు జిఎం లలితేంద్ర ప్రసాద్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం. మల్లయ్య, సేఫ్టీ ఆఫీసర్ ఎన్. పైడయ్య, ప్రాజెక్ట్ ఇంజనీర్ ఎన్. వెంకటవంశీధర్, ఇన్‌చార్జ్ మేనేజర్ శ్రీధర్ గౌడ్, గని అధికారులు, భద్రతా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో మజ్జిగ పంపిణీ అభినందనీయం

### పిసిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్

**ప్రజాపక్షం / జన్నారం :** వేసవి వేడి నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు పూర్ణచంద్రరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం జన్నారం పట్టణంలోని వారసంతలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ స్వయంగా ప్రజలకు, చిరు వ్యాపారులకు మజ్జిగను పంపిణీ చేశారు. ప్రతి మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల సౌకర్యార్థం ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. జన్నారం పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి సంతకు వచ్చిన ప్రజలు, వ్యాపారులు భారీ సంఖ్యలో తరలివచ్చి మజ్జిగను స్వీకరించారు.

# జగ్గాసాగర్‌లో ఆరోగ్య సిబ్బందికి సర్పంచ్ సాయి గౌడ్ సత్కారం

ప్రజాపక్షం/మెట్‌పల్లి : ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జగ్గాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలందిస్తున్న ఆరోగ్య సిబ్బందిని గ్రామ సర్పంచ్ పుల్ల సాయి గౌడ్ సత్కరించారు.గ్రామ ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్నందుకు పీహెచ్‌సీ సిబ్బందిని అభినందించారు.ఈ సందర్భంగా ఉత్తమ వైద్యురాలిగా డా. తాటిపర్తి శివాని ని సత్కరించారు. గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తున్నందుకు ఆమెను ప్రశంసించారు.అదేవిధంగా ఉత్తమ ఏఎన్ఎంగా ఎన్. ప్రియదర్శిని నీ కి పురస్కారం అందజేశారు. గ్రామాల్లో



ఆరోగ్య సేవలను ప్రజలకు చేరవేస్తూ కృషి చేస్తున్న ఆశా కార్యకర్తలకూ అవార్డులు ప్రదానం చేశారు. రంగారావుపేటకు చెందిన సిలువేరి మమత, కొండ్రికార్ల గ్రామానికి చెందిన చిలువేరి రేఖ ఉత్తమ ఆశా కార్యకర్తలుగా ఎంపికయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ పుల్ల సాయి గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పీహెచ్‌సీ సిబ్బంది చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా. ఎల్లాల అంజిత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, 11వ వార్డు సభ్యుడు రాజేశం, పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామ ప్రజలు మరియు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఆరోగ్య సిబ్బందికి గుర్తింపుగా అవార్డులు అందజేయడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు.

## పాలన మరిచి జల్సాలకు...




ప్రజాపక్షం /మల్లాపూర్ : గ్రామ ప్రజలకు సేవ చేస్తారని నమ్మకంతో ఓటు వేసిన వేంపల్లి గ్రామ ప్రజలను గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు ఏకంగా పాలన మరిచి జల్సా లకు వెళ్లి నట్టేట ముంచేస్తున్నారని(గ్రామానికి చెందిన గుగ్లవత్ శ్రీనివాస్ నాయక్ మంగళవారం ఆరోపించారు. నమ్మకంతో గెలిపించిన సర్పంచ్ వార్డ్ నెంబర్లు తమకు ఏదో సేవ చేస్తారని గెలిపిస్తే మొత్తానికి మొత్తం గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు తమ ఆనందం కోసం గోవా వంటి ప్రదేశాలకు జల్సాలకు వెళ్లడం ఎన్నో అనుమానాలకు తెర లేపుతుందని,వీరితోపాటు ప్రభుత్వం జీతం తీసుకుంటూ ప్రజలకు సేవ చేయాల్సిన పంచాయతీ కార్యదర్శి సైతం పాలకవర్గ సభ్యులతో చేతులు కలిపి టూర్లకు వెళ్లడం పెను దుమారాన్ని లేపింది. కాగా గ్రామానికి చెందిన శ్రీనివాస్ నాయక్ జిల్లా పంచాయతీరాజ్ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారికి పాలకవర్గ సభ్యుల పర్యటన ఎన్నో అనుమానాలు కలిగిస్తుందని తక్షణమే ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టకుండా వేంపల్లి గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని బాధ్యులైన పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యుల పర్యటన చిలికి చిలికి గాలి వానలా మారింది.

## మృతుల కుటుంబాలకు కొప్పుల పరామర్శ



ప్రజాపక్షం /పెగడపల్లి : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆరవెల్లి గ్రామ యువకుల కుటుంబాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. మండలంలోని ఆరవెల్లి గ్రామానికి చెందిన గాలిపెల్లి ఆదిత్య, శ్రీరామ్ విఘ్నేష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం మృతుల నివాసాలకు వెళ్లిన ఆయన, వారి చిత్రపటాలకు నివాళులర్పించారు.అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారికి ధైర్యం చెప్పారు.పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొప్పుల ఈశ్వర్ వెంట ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి,సర్పంచులు ఉప్పులంచ భవాని లక్ష్మణ్, కాశెట్టి వీరేశం, ఉపసర్పంచులు బత్తిని శంకర్, కస్తూరి శ్రీనివాస్,వార్డు సభ్యులు గాలిపెల్లి సత్తయ్య,మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు తిరుమణి నరసింహారెడ్డి,మడిగల తిరుపతి,అందె వెంకటేశం,నాగుల రాజశేఖర్,ఉమ్మెత్తల భాస్కర్ రెడ్డి, రహీం,పెంటల శ్రీనివాస్,కార్యకర్తలు మరియు గ్రామస్తులు ఉన్నారు.

## అన్ని శాఖల అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు



ప్రజాపక్షం/ఇల్లందకుంట : అపర భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు విజయవంతంగా పూర్తిచేసిన సందర్భంగా ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు అన్ని శాఖల అధికారులకు, సేవా సంస్థలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దాదాపు 13 రోజుల పాటు జరిగిన ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అన్నదానం, వసతి, రవాణా తదితర సేవలను సమర్థవంతంగా అందించడంలో జమ్మికుంట కాటన్ మిల్లర్స్, పారాబోయిల్డ్ రైస్ మిల్లర్స్, రా రైస్ మిల్లర్స్ ముఖ్యపాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ, ఆర్అండ్‌బి శాఖ, ఆరోగ్యశాఖ, ఆర్టీసీ యాజమాన్యం, రెవెన్యూ శాఖ, 108 సేవలు, మున్సిపాలిటీ అధికారులు, పారిశుద్ధ కార్మికులు, 18 గ్రామాల గ్రామపంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా జరిగాయని తెలిపారు. దేవస్థానం అధికారులు, అర్చకులు, సిబ్బంది, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అందించిన సహకారం కూడా విశేషమని కొనియాడారు.ఈ సందర్భంగా ఉత్సవాల భద్రతను కట్టుదిట్టంగా నిర్వహించిన పోలీస్ శాఖకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పోలీస్ సిబ్బంది కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని శ్రీ సీతారామచంద్రస్వామి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు గోలి కిరణ్, గోడిశాల పరమేష్, కారింగుల రాజేందర్, సింగిరెడ్డి గోపాల్, కురిమిండ్ల చిరంజీవి, ఎడ్ల కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అడోరేషన్ సొసైటీ సేవలు అభినందనీయం:సర్పంచ్ వనజ



ప్రజాపక్షం /పెగడపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడిని నివారించడమే లక్ష్యంగా ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ ముందుకొచ్చింది. మంగళవారం నంచర్ల గ్రామంలోని ఎస్సీ కాలనీ (8వ వార్డు) లో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్ వెల్ ను గ్రామ సర్పంచ్ కుంటాల వనజ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ లతో కలిసి సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ సిస్టర్ జిస్నా మరియు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిస్టర్ జిస్నా మరియు మాట్లాడుతూ ప్రజల నీటి అవసరాలను తీర్చి, వారు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ బోర్ వెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్పంచ్ సొసైటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్యామ్ సుందర్ రెడ్డి, కార్యదర్శి నవీన్ కుమార్,ప్రాజెక్టు కోఆర్డినేటర్ సిస్టర్ దీప్తి, సొసైటీ ప్రతినిధులు మర్రి మల్లేశం, నరెడ్డి శ్రీనివాసరెడ్డి, రమేష్,రూప, స్రవంతి,మౌనిక,వార్డు సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవ అవగాహన ర్యాలీ



ప్రజాపక్షం/జమ్మికుంట : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వరుణ, వావిలాల గ్రామ సర్పంచ్ కొండ అర్జున్‌తో కలిసి వావిలాల గ్రామంలో సెయింట్ మేరీ పాఠశాల విద్యార్థులతో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 12 ఆరోగ్య ఉప కేంద్రాలలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అందరి ఆరోగ్యం మన అందరి బాధ్యత,ఆరోగ్యపు అలవాట్లు సిరిసంపదకు తొలి మెట్లు, నేటి ఆడపిల్ల రేపటి అమ్మ, ఆడపిల్లలు దేశానికి గర్వ కారణం, వ్యాధి నిరోధక టీకాలు పిల్లల పాలిట వరాలు,బాల్య వివాహాలు చట్టరీత్యా నేరాలు,ఎండలోకి వెళ్ళవద్దు వడదెబ్బకు గురి కావొద్దు, సరదా సరదా సిగరెట్టు నరకానికి తొలిమెట్టు,త్రాగే నీరు సురక్షితమైతే మనము సురక్షితమే వంటి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వరుణ హెల్త్ ఎడ్యుకేటర్ అడిదెల మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా, ప్రజలలో ఆరోగ్యకరమైన జీవనశైలి, శారీరక,మానసిక ఆరోగ్యం, వ్యాధి నివారణపై అవగాహన కల్పించడంతోపాటు "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే నినాదంతో, పౌష్టికాహారం, వ్యాయామం, పరిశుభ్రత ప్రాముఖ్యతను, ఆరోగ్యకరమైన అలవాట్లు తక్కువ ఉప్పు, వ్యాయామం ప్రోత్సహించడం, వ్యాధుల నివారణ గురించి అవగాహన కల్పించడంతో పాటు శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సును పెంపొందించి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చేపూరి సతీష్, హెల్త్ ఎడ్యుకేటరు మోహన్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ అరుణ, ప్రిన్సిపాల్ సిద్దూ జర్జ్, బీనా, ఫార్మాసిస్ట్ రాజశ్రీధర్ రావు, నర్సింగ్ ఆఫీసర్ సాయికుమార్, రేష్మ అంగన్వాడీ టీచర్, సుమలత, మణి, రమ, పుష్పలత, మల్లేశ్వరి, లక్ష్మి ఆశా కార్యకర్తలు విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా రాపల్లి శ్రీనివాస్



ప్రజాపక్షం/వేములవాడ: వేములవాడ ప్రెస్ క్లబ్ టి యు డబ్ల్యూ జె అనుబంధం ఐ జె యు ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా రా పెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కంకణాల సాయి శరత్, ప్రధాన కార్యదర్శిగా ఉల్లెందుల మల్లేశం, కోశాధికారిగా గడీల ప్రవీణ్, సహాయ కార్యదర్శిగా మాదం బాబు, కార్యవర్గ సభ్యులుగా గొంగళ్ళ రవికుమార్, కొక్కుల శ్రీనివాస్, తూపుకారి శ్రీనివాస్, పోకల అంజనేయులు, నగేష్,హబీబ్ పాషా, కాజా నయిముద్దీన్ లు ఎన్నికైనట్లు ప్రెస్ క్లబ్ ఎన్నికల అధికారి రేగుల దేవేందర్ తెలిపారు, ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు గొగి కారి శ్రీనివాస్, హింగే శ్రీనివాస్, గడ్డం సత్యనారాయణ రెడ్డి, దాసరి దేవేందర్, పారువెల్లి శ్రీనివాస్, దూలం రఘు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి తీరాన్ని పరిశీలించిన అధికారులు

ప్రజాపక్షం/ధర్మపురి : 2027 లో జరుగనున్న గోదావరి పుష్కరాల దృష్ట్యా జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని గోదావరి తీర ప్రాంతాలను, పుష్కర ఘాట్ల నిర్మాణ స్థలాలను మంగళవారం ఇంజనీరింగ్ చీఫ్ (జనరల్) i&cad రమేష్ బాబు పరిశీలించారు.మండలం లోని జైన,రాజారాం,దమ్మన్నపేట్,ధర్మపురి గోదావరి తీర ప్రాంతాలను సందర్శించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంఘనబట్ల దినేష్ మున్సిపల్ చైర్పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్, ఈఈ సత్యనారాయణ, ఎస్ఈ రమేష్ డిఈ ధర్మకుమార్,పిఆర్ ఇంజనీరింగ్ కరీంనగర్ ఎస్ఈ గిరీష్ బాబు ,తహసిల్దార్ ఏరుకొండ శ్రీనివాస్,పిఆర్ ఈఈ లక్ష్మణ్ రావు,డిఈఈ గోపాల్,పి ఆర్ నీటిపారుదల శాఖ సిబ్బంది ,అధికారులు, తదితరులు ఉన్నారు.

## మార్కెట్ కమిటీలో మజ్జిగ పంపిణీ



ప్రజాపక్షం /మెట్‌పల్లి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ హమాలీలు, జాడు కార్మికులు. రైతులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ కూన గోవర్ధన్ మాట్లాడుతూ తీవ్ర ఎండల్లో పని చేస్తున్న హమాలీలు, జాడు కార్మికులు అమ్మకానికి వచ్చిన రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పుల్లూరు నవీన్, కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి,ఆపరేటర్ సతీష్,కార్యాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీఎల్లమ్మ దేవాలయంలో ఆదాయం రూ.57,522

ప్రజాపక్షం/మెట్‌పల్లి : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలోని శ్రీ ఎల్లమ్మ దేవాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం (07.04.2026) రోజున వచ్చిన ఆదాయ వివరాలను అధికారులు వెల్లడించారు.వివిధ సేవా టికెట్ల ద్వారా రూ.42,640 ఆదాయం వచ్చిందని తెలిపారు. అలాగే, అమ్మవారి దేవాలయంలో ఏర్పాటు చేసిన హుండీలు విప్పి లెక్కించగా రూ.14,882 నగదు వచ్చినట్లు పేర్కొన్నారు. మొత్తంగా ఈరోజు దేవాలయానికి రూ.57,522 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి సి. సురేందర్ పాల్గొన్నారు. దేవాదాయ శాఖ డిప్యూటేషన్ సిబ్బంది కల్వకుంట్ల అనిల్ రావు, కూకట్ల రాజేందర్, గుంటుక శివ, కేశవ్, మ్యాత రత్న తదితరులు పాల్గొన్నారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెట్పల్లి పోలీసులు ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు సౌకర్యవంతంగా సేవలు అందిస్తున్నామని దేవాలయ కార్యనిర్వహణ అధికారి కే. కాంత రెడ్డి తెలిపారు.

# ఆరోగ్యవంతమైన అలవాట్లను అలవర్చుకోవాలి

## జిల్లా వైద్యాధికారి సుజాత



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** ఆరోగ్యవంతమైన అలవాట్లను అలవర్చుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జగిత్యాల జిల్లా వైద్యాధికారి సుజాత పేర్కొన్నారు.ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని జెఎస్ రాంవెల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యాధికారి సుజాత, ఉప వైద్యాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆరోగ్యకరమైన అలవాట్లు ఆశాజనకమైన భవిష్యత్తు అనే అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి సుజాత మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యమైన అలవాట్లు చేసుకోవాలని తద్వారా భవిష్యత్తు ఆరోగ్యమయంగాను, ఆశాజనకంగానూ ఉంటుందని తెలిపారు. సమతులమైన పోషక ఆహారం తీసుకుంటూ సరైన ఆహారాన్ని తీసుకున్నట్లయితే రోగాల బారిన పడకుండా ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించగలుగుతారని తెలిపారు. ఏప్రిల్ ఆరవ తేది నుంచి 11 వ తేది వరకు వివిధ అంశాలపై ప్రతిరోజు ఒక అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వైద్య సిబ్బంది అందరూ అప్రమత్తంగా ప్రజలలో విస్తృతమైన అవగాహన కల్పించవలసిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెఎస్ రాంవెల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కృష్ణకుమారి, సిఓ వేణుగోపాల్, హెచ్ఈఓ శ్రీధర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి రోయింగ్ పోటీలకు జమ్మికుంట వాసి ఎంపిక



**ప్రజాపక్షం/జమ్మికుంట:**జమ్మికుంట పట్టణం కేశవపురం 15వ వార్డుకి చెందిన పాతకాల ప్రశాంత్ జాతీయ స్థాయి రోయింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఏప్రిల్ 8 నుండి 12 వరకు ఒడిశా రాష్ట్రంలోని కటక్ నగరంలో నిర్వహించనున్న ఫస్ట్ ఆల్ ఇండియా ఇండోర్ రోయింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రం తరపున ఆయన పాల్గొననున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఎస్‌పిఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రశాంత్ 2012 సంవత్సరం నుంచి అథ్లెటిక్స్‌లో పాల్గొంటూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించారు. క్రీడల్లో తన ప్రతిభను కొనసాగిస్తూ రోయింగ్ లోనూ జాతీయ స్థాయికి ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, క్రీడాభిమానులు ప్రశాంత్‌కు అభినందనలు తెలుపుతూ పోటీల్లో విజయం సాధించి తెలంగాణ రాష్ట్రానికి, స్వగ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# కనగర్తి గ్రామ ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాపక్షం/ఇల్లందకుంట :** ఎండలు మండుతున్న వేళ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇల్లందకుంట మండలంలోని కనగర్తి గ్రామంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని మంగళవారం గ్రామ సర్పంచ్ రామంచ సంపత్, వార్డు సభ్యులు, కార్యదర్శి క్రాంతి కుమార్ గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలం తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో, గ్రామ ప్రజలు మాత్రమే కాకుండా బాటసారులు కూడా ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎండల ప్రభావం ఎక్కువగా ఉన్న ఈ కాలంలో ప్రతి ఒక్కరూ తగినంత నీరు తాగాలని, ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

# పిహెచ్‌సి ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:**ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కలెక్టర్, డిఎంహెచ్ఓ ఆదేశాల మేరకు ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి గ్రామ సర్పంచ్ దారా సురేష్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మధుకర్ మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని చేయి చేయి కలుపుతూ ఐకమత్యంగా సైన్స్ ప్రకారం నడుచుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన సమాజం కొరకు పాటుపడాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్యంపై నమ్మకం ఉంచాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా అమలయ్య కార్యక్రమాలన్నీ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మధుకర్, ఉప సర్పంచ్ రంజిత్, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు విఓ లు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ సందర్శించిన

## మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్



**ప్రజాపక్షం/జమ్మికుంట :** జమ్మికుంట పట్టణంలోని 30 వార్డులకు సంబంధించిన చెత్త చెదారం, రోడ్డు, డ్రైన్ గృహ నివాసుల నుండి సేకరించే చెత్త అన్ని కూడా సేకరించి డంపు చేసేటటువంటి డంపింగ్ యార్డ్ యొక్క పరిస్థితినీ మంగళవారం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్, శ్రీకాంత్ లకు పలు సూచనలు చేశారు.

# అంబేద్కర్ 135వ జయంతి భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

## హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ అంబాల ప్రభాకర్




**ప్రజాపక్షం/జమ్మికుంట :** బిఎస్‌పి జాతీయ అధ్యక్షురాలు, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి బెహెన్జీ కుమారి మాయావతి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించింది. అందులో భాగంగా అదిలాబాద్ జోన్ (వన్) పరిధిలో అదిలాబాద్ నిజామాబాద్ కరీంనగర్ జహీరాబాద్ పార్లమెంటరీ స్థాయిలో భారత రత్న బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని కరీంనగర్ లోని మహాత్మ జ్యోతి రావు పూలే (సర్కస్ గ్రౌండ్) మైదానంలో ఈనెల 14న సాయంత్రం బిఎస్‌పి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు బీఎస్పీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ అంబాల ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం జమ్మికుంట పట్టణంలో గాంధీ చౌరస్తా వద్ద అంబేద్కర్ జయంతి వాల్ పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ అగ్రవర్ణ పేదలందరూ, బహుజన సమాజ్ పార్టీ నాయకులు అంబేద్కర్ అభిమానులు అంబేద్కర్ సంఘ నాయకులు కుటుంబ సమేతంగా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంత చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్లమెంట్ ఇన్చార్జ్ దొడ్డే శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు గిన్నారపు మహేందర్, బీఎస్పీ ఎమ్మెల్యే ఎంపీ కాంటెస్ట్ అభ్యర్థి మారపల్లి మొగిలయ్య, హుజురాబా ద్ నియోజకవర్గ అధ్యక్షులు మంద సమ్మయ్య, హుజురాబా ద్ నియోజకవర్గం ఇంచార్జ్ వేల్పుల మల్లేష్, జమ్మికుంట మండల అధ్యక్షులు దాసరపు మహేందర్, బీసీ సంఘాల సమన్వయ కమిటి హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు మామిండ్ల మల్లయ్య యాదవ్, సోషల్ మీడియా ని యోజకవర్గ ఇన్చార్జ్ మంద జగన్, గంగారపు ప్రశాంత్, అంజి, గంగారపు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



**ప్రజాపక్షం /పెగడపల్లి:** మండలంలోని సుద్దపెల్లి గ్రామంలో మంగళవారం పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ అయితరవేణి లక్ష్మణ్, పశు వైద్యాధికారి డాక్టర్ హేమలత కలసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం, శీతాకాల మార్పుల సమయంలో పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు ఈ టీకాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.రైతులు తమ పశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండి, ప్రభుత్వం కల్పించే ఇలాంటి ఉచిత సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కస్తూరి శ్రీనివాస్, వార్డు సభ్యులు గుర్రం కీర్తన విద్యాసాగర్, పన్యాల మహేందర్,అత్తినేని ఎల్లయ్య,పశువైద్య సిబ్బంది మతిన్, వినీత్, వినోద్ రైతులు గడ్డం తిరుపతి, ఐతం సత్తయ్య,పన్యాల హన్మంతు, రైతులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీమంత్రి



**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన పలువురి కుటుంబాలను మంగళవారం మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు.బీఆర్ఎస్ పార్టీ ధర్మపురి పట్టణ కన్వీనర్ బండారి రంజిత్ నానమ్మ లచ్చవ్వ ఇటీవల మృతిచెందగా మాజీమంత్రి పరామర్శించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో ఇటీవల దుర్మరణం చెందిన మాదాసు అమర్ నాథ్ కుటుంబాన్ని,బుద్దేష్ పల్లె కు చెందిన పెంట సుశీల మృతిచెందగా వారి కుటుంబాలను కొప్పుల ఈశ్వర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు ఏ.శ్రీకాంత్ రెడ్డి, అయ్యోరి రాజేష్, సంగి సత్తెమ్మ,ఎల్లాగౌడ్, సీహెచ్ నర్సయ్య, ఆసిఫ్, శేఖర్, రవి, అశోక్, శ్యాం, సుధాకర్ పాల్గొన్నారు.

# రైతుల పట్ల మీకున్న చిత్తశుద్ధి ఏంటి



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకుండా రైతుల పట్ల కపట ప్రేమ చూపిస్తుందని బి ఆర్ ఎస్ మండల శాఖ అధ్యక్షుడు తోట శ్రీనివాస్ అన్నారు. ఈమెరకు మంగళవారం మల్లాపూర్ మార్కెట్ యార్డులో రైతులు పోసిన మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కాగా శ్రీనివాస్ మాట్లాడుతూ గత వారం రోజులు క్రితం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులతో కలిసి తాము రోడ్డెక్కి ధర్నా చేస్తే రెండు మూడు రోజుల్లో కొనుగోలు కేంద్రం ప్రారంభించేలా చూస్తామని అధికారులతో తాము చేపట్టిన ధర్నాను విరమింప చేసేలా చేశారని కానీ రోజులు గడుస్తున్న ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన గురవుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల అసలు చిత్తశుద్ధి ఉందా అని ప్రశ్నించారు. కిసాన్ సెల్ నాయకులు అని చెప్పుకునే వారు ఆందోళన చెందుతున్న మొక్కజొన్న రైతులకు ఏం సమాధానం చెబుతారని ఘాటుగాని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మణ్, మాజీ జెడ్పిటిసి సంధి రెడ్డి శ్రీనివాస్, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ శరత్, సీనియర్ నాయకులు డీలర్ మల్లయ్య రామ్ రెడ్డి ,గంగా రాజం, నాయకులు రవి కుమార్ యాదవ్, లింగస్వామి, లక్ష్మణ్ ,రాజారెడ్డి ,గంగా రెడ్డి ,రఫీ ,జవహర్లాల్,తదితరులున్నారు.

# పారుపల్లిలో బెల్ట్ షాపు నిర్వాహన బంద్‌కు తీర్మానం..?

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలో బెల్ట్ షాపుల బంద్ కోసం గ్రామస్తులు తీర్మానం చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు సమాచారం తెలిసింది.?పారుపల్లి గ్రామంలో బెల్ట్ షాపుల వల్ల కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతింటున్నాయని భావించిన మహిళలు, గ్రామ పెద్దలు ఇటీవల జరిగిన గ్రామ సభలో ఒకచోట చేరి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.తీర్మానంగ్రామంలో ఇకపై ఎలాంటి బెల్ట్ షాపులు నడపరాదని, ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే భారీగా జరిమానా విధించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నట్లు సమాచారం తెలిసింది.? దీనికి ప్రధాన కారణం కొంతమంది మద్యానికి బానిసలవుతుండటం, గ్రామంలో అశాంతి నెలకొనడం వంటి కార్యక్రమాలు జరుగుతున్నట్లు అందుకే మద్యపానం నిషేధం తీర్మానానికి సిద్ధపడ్డట్లు తెలుస్తుంది.

# ఎస్ఎస్‌సి స్పాట్ రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** 2025 మార్చి లో నిర్వహించిన ఎస్ఎస్ సి స్పాట్ రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని టీటీ జేఏసీ, యూఎస్పిసి, జాక్టో రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం టీటీ జేఏసీ, యూఎస్పిసి, జాక్టో ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజనం విరామ సమయంలో ఎస్ ఎస్ సి స్పాట్ సెంటర్ (నిర్మల పాఠశాల నాంపల్లి లో) నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అక్టోబర్ 2024 లో నిర్వహించిన కుల గణన రెమ్యూనరేషన్ చెల్లింపులు చేయాలని అన్నారు. 7 సం రాలు నుండి ఎస్ ఎస్ సి స్పాట్ రెమ్యూనరేషన్ పెంచలేదని ఇంటర్ ఈ 7 సం రాలలో 2 సార్లు మాత్రమే పెంచారని, కనీసం 50% అయినా పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం నిర్వహిస్తున్న ఎస్ఎస్ సి స్పాట్ రెమ్యూనరేషన్ వెంటనే చెల్లింపులు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో బత్తిని సత్యనారాయణ, మొగిలి లక్ష్మణ్, మండల,జిల్లా, రాష్ట్ర బాధ్యులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి కల్పించడంలో మెగా జాబ్ మేళా కీలకం

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో మెగా జాబ్ మేళా కీలకమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మెగా జాబ్ మేళా నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా మెగా జాబ్ మేళాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి టాస్క్, డిఇఇటి, జిల్లా ఉపాధి కార్యాలయ అధికారులు సమన్వయంతో పని చేసి జాబ్ మేళాలను నిర్వహించాలని సూచించారు.మే 1 నుండి 13 వరకు ఉమ్మడి జిల్లాల ప్రధాన కేంద్రాలలో జాబ్ మేళాలను నిర్వహించాలని, మే 14 నుండి 24 వరకు ఇతర ప్రాంతాలలో మెగా జాబ్ మేళాలను నిర్వహించాలని తెలిపారు. మే 25 లేదా 26 తేదీలలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను కలెక్టర్ లేదా ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేయాలని పేర్కొన్నారు.పెద్దపల్లి జిల్లాలో మెగా జాబ్ మేళా నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమం నిర్వహణ స్థలం, పాల్గొనే సంస్థల సంఖ్య, కల్పించనున్న ఉద్యోగ అవకాశాలు, అభ్యర్థుల సౌకర్యాలు వంటి ప్రతి అంశాన్ని సూక్ష్మంగా ప్రణాళిక చేయాలని సూచించారు.టాస్క్, ఇతర శిక్షణ కేంద్రాల ద్వారా నిరుద్యోగ యువతకు సరైన శిక్షణ అందించి, జాబ్ మేళాలో పాల్గొనేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించాలని తెలిపారు. మంచి ఉపాధి అవకాశాలను పొందేందుకు యువతను సిద్ధం చేయడం ముఖ్యమని పేర్కొన్నారు.టాస్క్ ప్రాంతీయ కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతకు నిరంతరం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ, నైపుణ్యాలతో పాటు అవసరమైన ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. యువత టాస్క్ వంటి సదుపాయాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని తమ భవిష్యత్తును మెరుగుపరుచుకోవాలని సూచించారు.అలాగే జిల్లా లోని అన్ని డిగ్రీ, ప్రొఫెషనల్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమన్వయ సమావేశం నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులను కూడా సంప్రదించి, జాబ్ మేళా ద్వారా లభించే ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని, అవసరమైన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు,జిల్లా పరిశ్రమల అధికారి, కీర్తి కాంత్, టాస్క్ సెంటర్ అధికారి కౌసల్య, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆరోపణలపై స్పందించిన భార్యాభర్తలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** పెద్దపల్లిలో ఇటీవల తమపై జరుగుతున్న ఆరోపణలు, బ్యానర్లలో చేసిన ప్రచారం పూర్తిగా అవాస్తవమని తోడేటి బాపు, సంధ్య తెలిపారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేస్తూ తమ కుటుంబ ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు.డబ్బుల వ్యవహారంలో కూడా ఒకసారి రూ.34 లక్షలు, మరోసారి రూ.43 లక్షలు అంటూ భిన్నంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. మమ్మల్ని, మా కుటుంబాన్ని చెడుగా చూపించేందుకు ఇలా దిగజారి తప్పుడు ప్రచారం చేస్తున్నారు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్, బంగారం స్కీమ్ పేరుతో మోసం చేశామన్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఖండించారు. తమ వద్ద అన్ని సాక్ష్యాధారాలు ఉన్నాయని, నిజాన్ని బయటపెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మా పరువు తీసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తోడేటి బాబు, సంధ్య కోరారు. అసత్య ప్రచారం కొనసాగిస్తే పరువు నష్టం దావా వేయడమే కాకుండా, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.అలాగే వారు చేసిన తప్పుకు తమ కుటుంబానికి అందరి ముందు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు ఒద్దం చిన్నయ్య, ఒద్దం స్వరూప, కట్ల సరిత, జానకీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## గ్రామస్తుల ఆరోగ్యమే మహాభాగ్యం



**ప్రజాపక్షం/మంథని :** గ్రామస్తుల ఆరోగ్యమే మహా భాగ్యమని కన్నాల సర్పంచ్ గుడిసె గట్టయ్య అన్నారు. మంగళవారం మంథని మండలం కన్నాల గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల భాగంగా అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు, తల్లిదండ్రులకు బాలామృతం, కోడిగుడ్లు, బలహీనంగా ఉన్న చిన్నారులకు బాలామృతం ప్లస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గట్టయ్య యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్క చిన్నారి ఆరోగ్యంగా ఉండాలని కాంక్షతో అంగన్వాడి కేంద్రాల ద్వారా పౌష్టికమైన ఆహారం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పుట్టిన పిల్లల నుండి ఐదు సంవత్సరాల వరకు పిల్లలకు పౌష్టికరమైన ఆహారం అందించడం ద్వారా బలంగా తయారవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రామగిరి సంపత్, పంచాయతీ కార్యదర్శి మధుకర్, అంగన్వాడీ టీచర్ భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## 18న రాష్ట్ర స్థాయి ఉద్యమకారుల సమావేశం

**ప్రజాపక్షం/మంథని :** హైదరాబాద్ వేదికగా ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి విస్తృత స్థాయి సమావేశానికి మంథని నియోజకవర్గ నాయకులు, ఉద్యమకారులు భారీగా తరలిరావాలని మంథని నియోజకవర్గ ముఖ్య ప్రతినిధులు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.హైదరాబాద్‌లోని మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఈ భారీ బహిరంగ సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ విజయశాంతితో పాటు రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకులు హాజరై దిశా నిర్దేశం చేయనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్, మంథని నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జాడి జంపయ్య, ఉద్యమకాల్లో సభ్యుడు సర్వర్‌లు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి ఒక్క ఉద్యమకారుడు, కార్యకర్త బాధ్యతగా ఈ సమావేశానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

# 56 రోజుల చిన్నారికి రక్తదానం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** రక్తదానం చేయడంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్నారు. మండలంలోని ఐతరాజు పల్లి గ్రామ యువ నాయకుడు, వైద్య ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడ్డి సాయి కిషోర్ గౌడ్.మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ పిల్లల ఆసుపత్రిలో బేబీ అఫ్ రమ్య 56 రోజుల చిన్నారి అనారోగ్యంతో బాధపడుతూ అరుదైన రక్తం 'ఒ' నెగిటివ్ అవసరం ఉందని ఐతరాజుపల్లి యువనాయకుడు వై కే ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడ్డి సాయికిషోర్ గౌడ్‌కు సమాచారం అందించగా స్పందించిన సాయికిషోర్ గౌడ్ తనే నేరుగా వెళ్లి కరీంనగర్ లోని మైత్రి బ్లడ్ బ్యాంక్ లో రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు.ఈ సందర్భంగా సాయికిషోర్ గౌడ్ మాట్లాడుతూ ఒక 56 రోజుల చిన్నారికి రక్తదానం చేయడం చాలా సంతోషం కలిగిందని సమాజంలో రక్తదానం చేయడం, చేపించడం అనేది ప్రతి ఒక్క యువకుడు ఒక బాధ్యతగా తీసుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు.రక్తదానం చేయడం అంటే ఒక ప్రాణదానం చేయడమేనని రక్తదానం చేయడం పట్ల ఎవరికి అపోహలు ఉండకూడదని తెలియజేసారు .ఈ సందర్భంగా 33వ సారి రక్తదానం చేసిన సాయికిషోర్ గౌడ్‌ని వై కే ఫౌండేషన్ వ్యవస్థాపకులు కండెం సురేష్, గౌరవ సలహాదారులు విజేందర్ రెడ్డి, బాధిత కుటుంబసభ్యులు, పలువురు అభినందించారు.

## సార్ మీరు తలుచుకుంటే మా జీవితాలు బాగుపడతాయి

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావుకు
రెండవ ఎఎన్ఎంల వినతి



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సార్ మీరు తలుచుకుంటే మా రెండవ ఎఎన్ఎంల జీవితాలు బాగుపడతాయని సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యే విజయ రమణారావు దగ్గర రెండవ ఎఎన్ఎంలు వినతి పత్రం సమర్పించి వారి మొరను విన్నవించారు. రెండవ ఎఎన్ఎంలు పలువురు మాట్లాడుతూ తమకు ఇచ్చిన హామీ మేరకు 20 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో, పని భారంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. గత ప్రభుత్వం మమ్మల్ని రెగ్యులర్ చేస్తానని చేయలేదు, మీరు ముఖ్యమంత్రి కి చాలా దగ్గర మీరు తలుచుకుంటే మా రెండవ ఎఎన్ఎంలు అందరూ రెగ్యులర్ అవుతారంటూ తమ బాధలను పంచుకుంటూ ప్రభుత్వవిప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుకు మంగళవారం రెండవ ఎఎన్ఎంలు వినతిపత్రం అందజేశారు. తాము తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని గత ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ విధానాలకు నిరసనగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తే ప్రతిపక్ష నాయకునిగా హాజరై మాకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పని భారంతో ప్రభుత్వం చేస్తున్న ప్రతి సంక్షేమ పథకంలో మేము భాగస్వామ్యం ఐ తూచా తప్పకుండా విధులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తున్నామని, అదనంగా పనిభారం మోపిన చేస్తున్నామని ప్రభుత్వ వి ప్ ఎమ్మెల్యే విజయ రమణారావుకు తమ మొరను వినిపించారు. స్పందించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు రెండవ ఎఎన్ఎం లకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

## బస్టాండ్‌లోమరుగుదొడ్ల పునర్నిర్మాణానికి చర్యలు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామపంచాయతీ పరిధిలోని బస్టాండ్ ఆవరణంలోని ఉన్న మరుగుదొడ్ల పునర్నిర్మాణానికి సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి శ్రీకారం చుట్టారు.బస్టాండ్ ఆవరణలో ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్ల పునర్నిర్మాణానికి సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.ఇటీవల జరిగిన గ్రామసభ కార్యక్రమంలో మరుగుదొడ్ల పునర్నిర్మాణానికి గ్రామస్తుల కోరిక మేరకు తీర్మానం చేశారు. ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పంచాయతీ నిధులతో వీటిని ఆధునీకరించే పనులను త్వరలో ప్రారంభించనున్నారు. నీటి వసతి కోసం కిషన్ రెడ్డి అన్నయ్య మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి జ్ఞాపకార్థంగా వారి కుమారుడు రాజేష్ రెడ్డి తన సొంత ఖర్చులతో ఉచితంగా నూతన బోరు వేయించనున్నారు. పునర్నిర్మాణం పూర్తయిన తర్వాత రోజువారీ శుభ్రత కోసం ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలని సర్పంచ్ నిర్ణయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవిత కిషన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి వచ్చే ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడం, బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచడంలో గ్రామస్తులు, ప్రయాణికులు సహకరించాలని కోరారు.

## ప్రజల సమస్యలకు నేరుగా పరిష్కారం

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రజల సమస్యల పరిష్కారానికి ఎటువంటి మధ్యవర్తులు అవసరం లేదని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సేవలు అందించే పేరుతో కొంతమంది మధ్యవర్తులు మోసాలకు పాల్పడుతున్నట్లు గమనించామని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కొందరు వ్యక్తులు భూ భారతి సమస్యలు పరిష్కరిస్తామని, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు వంటి ప్రభుత్వ పథకాలలో ఎంపిక చేస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఇలాంటి వ్యక్తులకు ఎటువంటి అధికారిక గుర్తింపు లేదని, వారు ప్రజలను మోసం చేస్తున్నారని స్పష్టం చేశారు.ఎవరైనా సమస్య పరిష్కారం పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే ఒక్క పైసా కూడా ఇవ్వవద్దని ప్రజలకు సూచించారు. అలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.ప్రజలు తమ సమస్యలను ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో నేరుగా జిల్లా కలెక్టర్ లేదా ఉన్నతాధికారులకు తెలియజేయవచ్చని తెలిపారు. అలాగే బుధవారం నుండి శుక్రవారం వరకు మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కలెక్టర్ ప్రజలను కలుసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సమయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మధ్యవర్తులను నమ్మి డబ్బులు కోల్పోకుండా జాగ్రత్తగా ఉండాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి



**ప్రజాపక్షం/మంథని :** ప్రజలందరూ ఆరోగ్యంపైన అవగాహన కలిగి ఉండాలని మంథని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సుధారాణి పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంథని మున్సిపల్ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను జడ్జి సుధారాణి సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు.వైద్య చికిత్స పొందుతున్నటువంటి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ సేవలు,డయాలసిస్ సెంటర్, ల్యాబ్, వివిధ రికార్డుల గురించి ఆమె స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన వైద్యాన్ని అందించాలని వైద్యులకు సూచించారు. అత్యవసర సమయంలో వస్తున్న రోగుల పట్ల సానుకూలంగా స్పందించాలని ఆమె తెలిపారు. గడువు తీరనున్న మందులను ఆమె పరిశీలించారు. పలు రకాల సూచనలు ఆమె చేశారు. ఆమె వెంట బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి రఘోత్తం రెడ్డి, ఏజీపీ బోట్ల ఆంజనేయులు, న్యాయవాదులు శశి భూషణ్ కాచే, విజయ్ కుమార్, షబానా, శ్రీలక్ష్మి , వైద్యులు,ఆస్పత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

## నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సేకరించాలి

## కలెక్టర్ గరిమ అగ్రవాల్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలుపై ఏపీఎంలు, ఐకేపీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, బుక్ కీపర్లకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం శిక్షణ ఇవ్వగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు. గ్రేడ్ ఏ రకం వరి ధాన్యం క్వింటాలుకు రూ.2,389, కామన్ రకానికి క్వింటాలుకు రూ.2,369 గా ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో ఈ సీజన్లో దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని వివరించారు. ఐకేపీ ఆద్వర్యంలో జిల్లాలో ఏర్పాటు చేయనున్న 136 కొనుగోలు కేంద్రాల్లో టెంట్లు వేయించాలని, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. తూకం వేసే యంత్రాలు, తేమ శాతం చూపే యంత్రాలు, టార్పాలిన్లు, గన్ని బ్యాగ్స్ సరిపడా సమకూర్చుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు ఇతర వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. సంబంధిత ఏఈఓ ధృవీకరించిన తరువాత కొనుగోలు చేయాలని, కేటాయించిన మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. అన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల వద్ద రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, అధికారుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ గీత, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎల్ బుచ్చిబాబు, పౌర సరఫరాల శాఖ డీఎం నర్సింహారెడ్డి, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఏపీఎంలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు

## సిరిసిల్ల డి.ఎస్.పి నాగేంద్ర చారి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పని సిరిసిల్ల డి.ఎస్.పి నాగేంద్ర చారి హెచ్చరించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లోని సుందరయ్య నగర్ సిక్కువాడలో డిఎస్పి ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సరైన పత్రాలు లేని 23ద్విచక్ర వాహనాలు,15 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ ఆదేశాలతో ముందుకు వెళుతున్నామన్నారు.. అలాగే నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న బోయిని శ్రీనివాస్, బల్విర్ సింగ్ చందర్ సింగ్‌లపై కేసులు నమోదు చేసి 14 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ప్రజల రక్షణతో పాటు వారికి భద్రతాభావం (సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ) కల్పించడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రాంతాల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తులు లేదా నేరస్తులు షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయాలు కూడా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరా వంటి అంశాలపై ఎవరైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. స్వీయ రక్షణ కోసం కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయంలో పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు. భద్రతా పరమైన అంశాల్లో, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు పాత్ర కీలకం అన్నారు. ఎవరైనా ప్రజా జీవనానికి భంగం కలిగించినా, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడిన కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పట్టణ సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ లు శ్రీకాంత్,ఉపేందర్ ఆర్.ఎస్.ఐ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు వసతులు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజా పక్షం/ వేములవాడ:** ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. వేములవాడ పట్టణంలోని మహాత్మాజ్యోతి బాపూలే బాలికల రెసిడెన్షియల్ విద్యాలయంలో కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయం ఆవరణ, తరగతి గదులు, కిచెన్ లో ఆహార పదార్థాలను పరిశీలించారు. మెనూ చార్ట్ పరిశీలించి. ఏ ఏ వంటకాలు సిద్ధం చేస్తున్నారో తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, తమ కుటుంబంలో పిల్లలకు ఆహార పదార్థాలు ఎలా సిద్ధం చేస్తారో అలాగే ఇక్కడ విద్యార్థుల కోసం వండాలని ఆదేశించారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. అన్ని పరీక్షలకు సంబంధించిన టైమ్ ్థమ్ సిద్ధం చేసుకోవాలని, ఏ రోజు ఏ సబ్జెక్ట్ చదవాలో ముందే రాసుకోవాలని, దానికి అనుగుణంగా అన్ని సబ్జెక్టులు చదవడం, రాయడం పూర్తి చేయాలని తెలిపారు. రైటింగ్ కూడా సాధన చేయాలని, వార్షిక పరీక్షల సమయానికి అనుగుణంగా ఇప్పుడు అదే సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా సాధన చేయాలని పేర్కొన్నారు. ఇప్పటి మార్కులు మీరు తర్వాత చదివే ఉన్నత తరగతులకు ఎంతో కీలకమని స్పష్టం చేశారు.అన్ని సబ్జెక్టుల్లో రాణించడంతో వారి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడాలని, ఉన్నత స్థానాల్లో నిలవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.

# చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/బెజ్జంకి :** ఆర్థిక సమస్యలతో మనస్తాపానికి గురై పురుగుల మందు సేవించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని దేవక్కపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపి వివరాల మేరకు జనగాం పోచయ్య (47) ఆర్థిక,వ్యక్తిగత సమస్యలతో ఈ నెల 3న ఇంటిలో వ్యవసాయానికి ఉపయోగించే పురుగుల మం దు సేవించగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృ తి చెందాడు మృతుడి భార్య జనగాం లక్ష్మి పిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.సౌజన్య తెలిపారు.

# గూడూరుకు నియోజకవర్గ హోదా ఇవ్వాలి

**ప్రజాపక్షం/గూడూరు:** గూడూరు మండల కేంద్రాన్ని నూతన నియోజకవర్గ ంగా ప్రకటించాలని డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ నిర్వహించిన కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి బానోత్ దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు మండలంలో అధిక సంఖ్యలో ఆదివాసీ గిరిజన గిరిజనేతర ప్రజలు నివసిస్తూరని తెలిపారు. స్వాంతంత్రం అనంతరం రాజ్యాంగబద్దంగా గూడూరు ప్రాంతాన్ని షెడ్యూల్డ్ ఏరియాగా గుర్తించి గిరిజన చట్టాలను అమలు చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు.మండల పరిధిలోని 41 గ్రామపంచాయతీలలో సేమారు 70 వేల మంది ప్రజలు నివసిస్తూన్నారని అందులో 70 శాతం ఆదివాసీ గిరిజనులు 30 శాతం గిరిజనేతరులు ఉన్నారని వివరించారు. గూడూరు మండల కేంద్రం మహబూబాబాద్ నియోజకవర్గానికి సుమారు 30 కిలోమీటర్లు నర్సంపేట నియోజకవర్గానికి 20 కిలోమీటర్లు దూరంలో ఉండటంతో ప్రజలకు పరిపాలనా ఇబ్బందులు ఎదురవుతన్నాయని పేర్కోన్నారు. ప్రస్తుతం కూడా గూడూరులో పోలీస్ సర్కిల్ కార్యాలయం ఎక్సైజ్ ప్రోహిబిషన్ కార్యాలయం అటవీశాఖ సబ్ డివిజన్ సామాజిక ఆరోగ్య కేంద్రం పంచాయతీరాజ్ అర్‌బి ఆర్‌డబ్ల్యుస్ డివిజనల్ కార్యాలయాలు వంటి కీలక ప్రభుత్వ సంస్థలు అందుబాటులో ఉన్నాయని చేప్పారు. ఈకార్యక్రమంలో సుమన్ శ్రీకాంత్ అంజన్న వాసు బాలాజీ వెంకటేశ్ వీరన్న చరణ్ మోహన్ ఈశ్వర్ పాల్గోన్నారు.

# ప్రజల్లో ఆరోగ్య స్పృహను పెంపొందించాలి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఆరోగ్యం పట్ల స్పృహను పెంపొందించాలని, వైద్యం తో పాటుగా నైతిక మద్దతును వారికీ అందించాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. ఆర్. దిలీప్ కుమార్ నాయక్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చెల్పూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్.దిలీప్ కుమార్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిల్లో పనిచేసే ఆశ వర్కర్లు, ఏఎన్ఎం లు, హెల్త్ అసిస్టెంట్ లు ఆరోగ్యం చెడిపోయిన వారికీ వైద్య సేవలను అందించడంతో పాటుగా, వారికీ నైతిక మద్దతును ప్రకటించాలని సూచించారు. మానసిక ధైర్యంతో రోగి యొక్క జబ్బు సగం నయం అవుతుందని పేర్కొన్నారు. ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహనా పెంచినప్పుడు, ఎవరికీ వారు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ద వహించినప్పుడు ఆరోగ్య భారతం నిర్మితం అవుతుందని జడ్జి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్, సుధాకర్, అడ్వొకేట్స్ కూనూరు సురేష్ కుమార్, రాములు, శ్రీనివాస్, కంప అక్షయ, శ్రీదేవి, స్వాతి, న్యాయవాదులు మంగళంపల్లి రాజ్ కుమార్, రజిత పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలను ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/హనుమకొండ:** హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం హన్మకొండలోని ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలను ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించారు.మొదటగా ఓపీ కౌంటర్ల వద్ద సేవల పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, రిజిస్టర్ల నిర్వహణపై సమీక్ష చేశారు. అనంతరం ఫార్మసీని తనిఖీ చేసి, ఔషధాల నిల్వలు, పంపిణీ విధానాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా లేబర్ రూమ్, వార్డులు మరియు ఇతర విభాగాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కొన్ని వార్డుల్లో స్వల్పంగా శుభ్రత లోపం గమనించిన కలెక్టర్, వెంటనే శుభ్రత ప్రమాణాలను మెరుగుపరచాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు.వైద్య సేవల అమలు విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్, రోగులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలను సేకరించారు. ముఖ్యంగా వంట నూ నెను పునర్వినియోగం చేయవద్దని హెచ్చరించారు. మొత్తం ఆసుపత్రి నిర్వహణను మరింత సమర్థవంతంగా, శుభ్రతతో నిర్వహిస్తూ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేయాలని అధికారులకు క లెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాపక్షం/తొర్రూరు :** ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు ప్రొద్దుటూరు గౌరీశంకర్ అన్నారు. మంగళవారం తొర్రూరు బస్టాండ్ సెంటర్‌లో పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ ముందు శ్రీ వాసవి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మచ్చ సురేశ్, దేవస్థానం కమిటీ అధ్యక్షుడు చలువాది సత్యనారాయణతో కలిసి గౌరీశంకర్ చలివేంద్రంతో పాటు మజ్జిగను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగేశ్వర్‌రావు, బోనగిరి శంకర్, నాళ్ల కృష్ణమూర్తి, దారం కుమారస్వామి, వాసవి క్లబ్ మాజీ ప్రధాన కార్యదర్శి ఇమ్మడి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.